సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా
శుక్రవారం । 6 । సెప్టెంబర్ । 2024



టన్ను చీనీ రూ.24 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో గురువారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.24 వేలు, కనిష్టంగా రూ12 వేల ప్రకారం క్రయవిక్రయాలు జరిగాయి.



కిలో టమాట రూ.30

అనంతపురం శివారు కక్కలపల్లిమండీలో గురువారం కిలో టమాట గరిష్టంగా రూ.30, కనిష్టంగా రూ.10 ప్రకారం ధర పలికింది.

న్యూస్‌రీల్

పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలి



కొత్తచెరువులో ఆందోళన చేస్తున్న సత్యసాయి వాటర్ సప్లయ్ కార్మికులు

పుట్టపర్తి టౌన్: పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని సత్యసాయి వాటర్ సప్లయ్ కార్మికులు రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. గురువారం మూడు మండలాల కార్మికులు కొత్తచెరువులో ర్యాలీ నిర్వహించి నెహ్రూ కూడలిలో మానవహారంగా ఏర్పడ్డారు. వేతనాలు తక్షణమే చెల్లించాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 534 మంది సత్యసాయి వాటర్ సప్లయ్ కార్మికులు 900 గ్రామాలకు తాగునీరు అందిస్తున్నారన్నారు. తక్షణమే పెండింగ్‌లో ఉంచిన ఐదు నెలల వేతనాలు మంజూరు చేసి ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో సత్యసాయి వాటర్ సప్లయ్ యూనియన్ నాయకులు ఉపేంద్ర, ఉపేంద్రకుమార్, రాము, నాగేంద్ర, కార్మికులు పాల్గొన్నారు.

రాష్ట్ర హాకీ జట్టుకు ధర్మవరం క్రీడాకారులు



క్రీడాకారులను అభినందిస్తున్న దృశ్యం

ధర్మవరం అర్బన్: ఆంధ్రప్రదేశ్ హాకీ జట్టుకు ధర్మవరం క్రీడాకారులు ఎంపికయ్యారని హాకీ ఆంధ్రప్రదేశ్ వైస్ ప్రెసిడెంట్ బంధనాథం సూర్యప్రకాష్, జిల్లా హాకీ కోచ్ హుసేన్, జాయింట్ సెక్రటరీ అరవింద్‌గౌడ్ తెలిపారు. ధర్మవరంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో గురువారం క్రీడాకారులను వారు అభినందించారు. హాకీ ఇండియా ఆధ్వర్యంలో పంజాబ్ రాష్ట్రం జలంధర్‌లో ఈ నెల 9 నుంచి 19 వరకు జరిగే 14వ పురుషుల జాతీయ జూనియర్ హాకీ పోటీల్లో పాల్గొనే హాకీ ఆంధ్రప్రదేశ్ జట్టుకు ధర్మవరం క్రీడాకారులు మహబూబ్‌బాషా, మహమ్మద్ రఫీ ఎంపికయ్యారని తెలిపారు. రాష్ట్ర హాకీ జట్టు విజయం కోసం కృషి చేయాలని కోరుతూ వారిని అభినందించారు.

వైఎస్సార్‌సీపీ అనుబంధ విభాగాల్లో జిల్లా వాసులకు చోటు



రంగేగౌడ్



పొగాకు రామచంద్ర

పుట్టపర్తి టౌన్: వైఎస్సార్‌సీపీ అనుబంధ విభాగాల్లో ఇద్దరు జిల్లా వాసులకు చోటు దక్కింది. కుంచటి వక్కలిగ విభాగం రాష్ట్ర అధ్యక్షుడుగా రంగేగౌడ్, వాల్మీకి/ బోయ విభాగం రాష్ట్ర అధ్యక్షుడిగా పొగాకు రామచంద్రను నియమిస్తూ గురువారం పార్టీ కేంద్ర కార్యాలయం ఒక ప్రకటన విడుదల చేసింది. కాగా.. యాదవ విభాగం రాష్ట్ర అధ్యక్షుడిగా అనంతపురం జిల్లాకు చెందిన హరీష్‌కుమార్ యాదవ్, రజక విభాగం రాష్ట్ర అధ్యక్షుడిగా మీసాల రంగన్నను నియమించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించిన పార్టీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు.

సహకార సంఘాలు ఏర్పాటు చేసుకోండి

పుట్టపర్తి టౌన్: జిల్లా వ్యాప్తంగా ఉన్న చేనేత, పట్టు కార్మికులు, మాస్టర్ వీవర్లు సహకార సంఘాలు ఏర్పాటు చేసుకోవాలని జిల్లా చేనేత, జౌళిశాఖ అధికారి రమేష్ పేర్కొన్నారు. మున్సిపాలిటీ పరిధిలో 50 మంది, గ్రామీణ ప్రాంతాల్లో 30 నుంచి 50 మంది సభ్యుల వరకు సంఘాల్లో ఉండవచ్చు. సభ్యత్వ రుసుం కింద ఒక్కొక్కరు రూ.1000 చెల్లించాల్సి ఉంటుందని, ఆ మొత్తాన్ని సంఘం పెట్టుబడిగా ఆయా మండలాల్లో ఉన్న జిల్లా కేంద్ర సహకార బ్యాంక్‌లో జమ చేయాలని తెలిపారు. దీనికి అదనంగా ప్రభుత్వం వాటా ఇతర ప్రభుత్వ పథకాల ద్వారా ఆర్థిక సాయం చేస్తుందని పేర్కొన్నారు. తక్కువ వడ్డీతో రుణ సదుపాయం కూడా అందించనున్నట్లు వెల్లడించారు. సంఘం సభ్యులు ఉత్పత్తి చేసిన ఉత్పత్తులను జాతీయ, రాష్ట్ర స్థాయి వస్త్ర ప్రదర్శనలో అమ్ముకోవచ్చన్నారు. జాతీయ స్థాయినుంచి ఆర్డర్లు పొందే అవకాశం కూడా ఉంటుందని తెలిపారు. ధర్మవరం తయారు చేసే పట్టు చీరలకు 2014లో భౌగోళిక గుర్తింపు లభించినందున వీటిని ఉత్పత్తి చేసేందుకు సంఘాలు తప్పనిసరిగా ఉండాలని వివరించారు.



స్టేడియంలో యువత ఉత్సాహం



మ్యాచ్ దృశ్యాలను సెల్‌ఫోన్లలో బంధిస్తున్న యువతులు

సందడే.. సందడి

హర్షధ్వానాలతో అనంతపురంలోని ఆర్డీటీ క్రీడా గ్రామం దద్దరిల్లింది. గురువారం ఉదయం నుంచి సాయంత్రం వరకు హోరెత్తింది. దులీప్ ట్రోఫీ మ్యాచులకు అభిమానులు పోటెత్తారు. ఇండియా టీం–సీ, ఇండియా టీం– డీ మ్యాచ్ సందర్భంగా అభిమానులతో స్టేడియం కిక్కిరిసిపోయింది. టీమిండియా స్టార్ క్రికెటర్లను చూసి అభిమానులు కేరింతలు కొట్టారు. అక్షర్ పటేల్ మెరుపు ఇన్నింగ్స్ అభిమానులను కట్టి పడేసింది. భారీ సిక్సర్ బాది బాల్‌ను స్టేడియం బయటకు పంపిన సమయంలో అభిమానుల ఈలలు, కేకలతో స్టేడియం హోరెత్తింది. ఏసీఏ ట్రెమెన్ కమిటీ సభ్యులు మాంఛో ఫెర్రర్, ఆర్డీటీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అన్నే ఫెర్రర్, అసిస్టెంట్ కలెక్టర్ వినూత్న మ్యాచ్‌ను పర్యవేక్షించారు. అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు భద్రత చేపట్టారు.

– అనంతపురం/ సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం



బ్యాటింగ్ చేస్తున్న అక్షర్ పటేల్

గురువులు మార్గ నిర్దేశకులు

- ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాల సభలో కలెక్టర్ చేతన్

పుట్టపర్తి: ఉత్తమ సమాజ మార్గనిర్దేశకులు గురువులేనని కలెక్టర్ చేతన్ పేర్కొన్నారు. జగరాజుపల్లి వద్ద ఉన్న మంగళకర కళాశాల సమావేశ భవనంలో గురువారం ఉపాధ్యాయ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. కలెక్టర్‌తో పాటు పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై వివిధ కేటగిరీల్లో ఎంపికైన 27 మంది ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతలకు పురస్కారాలు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సమాజంలో అత్యంత గౌరవమైనది ఉపాధ్యాయ వృత్తి అన్నారు. ఉపాధ్యాయులు అంకితభావంతో విధులు నిర్వర్తించినపుడు మంచి ఫలితాలు వస్తాయన్నారు. విద్యార్థులను తీర్చిదిద్దే శక్తి ఉపాధ్యాయులకే ఉంటుందన్నారు. విద్యాబుద్ధులు చెప్పే ప్రతి ఒక్కరూ గురువులేనన్నారు. సమాజంలో ఉపాధ్యాయులకు ఎంతో గౌరవ మర్యాదలు ఉన్నాయన్నారు. ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలన్నా, ఉత్తమ సమాజం నిర్మించాలన్నా ఉపాధ్యాయులకే చెల్లిందన్నారు. కార్యక్రమంలో డీఈఓ మీనాక్షి, మున్సిపల్ చైర్మన్ తుంగా ఓబులపతి, ఆర్డీఓ భాగ్యరేఖ, డిప్యూటీ డీఈఓ రంగస్వామి, వైఎస్సార్‌టీఎఫ్ జిల్లా అధ్యక్షుడు పీవీ రమణారెడ్డి, పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు రజనీకాంత్‌రెడ్డి, రామకృష్ణారెడ్డి తదితరులతో పాటు ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అవార్డు గ్రహీతలు వీరే..

హెచ్‌ఎం కేటగిరీలో: శేషగిరిబాబు (కొండూరు ఉన్నతపాఠశాల, లేపాక్షి మండలం), నరేంద్ర (గౌడనహళ్లి ఉన్నత పాఠశాల, మడకశిర మండలం), కృష్ణానాయక్ (ప్రాథమికోన్నత పాఠశాల ఇస్లాపురం, పెనుకొండ మండలం)

స్కూల్ అసిస్టెంట్ల కేటగిరీలో: చంద్రమౌళీశ్వరగుప్తా (పూలకుంట ఉన్నత పాఠశాల, హిందూపురం మండలం), నరసింహప్రసాద్ (కొండూరు ఉన్నత పాఠశాల, లేపాక్షి మండలం), సంజీవయ్య (శాంతినగర్, ధర్మవరం), శ్రీనివాసులు (పైడేటీ ఉన్నత పాఠశాల, పరిగి మండలం), మహ్మద్ ఇసాక్ (బాలుర ఉన్నత పాఠశాల బుక్కపట్నం), కమలమ్మ (కొట్నూర్ ఉన్నత పాఠశాల, హిందూపురం మండలం). సుధాకర్ (కేశాపురం ఉన్నత పాఠశాల, కొత్తచెరువు మండలం), నాగభూషణ (బత్తలపల్లి ఉన్నత పాఠశాల), మెద్దరంగప్ప కె.శివరం (ఉన్నత పాఠశాల మడకశిర మండలం), రామాంజనేయులు (పులమతి ఉన్నత పాఠశాల లేపాక్షి మండలం), ప్రకాశ్‌రెడ్డి (ఉన్నత పాఠశాల కోళ్లమర్రి, మడకశిర మండలం), రాధ (ప్రాథమికోన్నత పాఠశాల కరావులపల్లి, గోరంట్ల మండలం), సరస్వతమ్మ (ఉన్నత పాఠశాల పెద్దగువ్వలపల్లి, రొద్దం మండలం), రమేశ్‌బాబు (ఉన్నత పాఠశాల ఎనుమలపల్లి, పుట్టపర్తి టౌన్), చంద్రశేఖర్ (ఉన్నత పాఠశాల బండ్లపల్లి, కొత్తచెరువు మండలం), చంద్రశేఖర్ (ప్రాథమికోన్నత పాఠశాల, నార్సింపల్లి, బుక్కపట్నం మండలం), రామమూర్తి (ప్రాథమిక పాఠశాల సూర్యచంద్రపురం బత్తలపల్లి మండలం), అరుణ్‌కుమార్ (ప్రాథమిక పాఠశాల శివపురం కొట్టాల కె.ఎస్ పాళ్యం కనగానిపల్లి మండలం), రవికుమార్ (ఎంపీపీ స్కూల్, గంతపల్లి, మడకశిర మండలం), శివప్రసాద్ (ఎంపీపీ స్కూల్, బుల్లసముద్రం మడకశిర మండలం), సుజాత (ఎంపీపీ స్కూల్ వజ్రపాళ్యం మడకశిర మండలం), శ్రీదేవి (ఎంపీపీ స్కూల్ మోదా, పరిగి మండలం), శంకర్‌నాయక్ (ఎంపీపీ స్కూల్ కోడిపల్లి, లేపాక్షి మండలం), అరుణాదేవి (ఎంపీపీ స్కూల్ ముదిగుబ్బ).





ఉపాధ్యాయ దినోత్సవంలో ఉత్తమ అవార్డులు సాధించిన కృష్ణానాయక్ (ఇస్లాపురం), ముద్దరంగప్ప (శివరం)కు అవార్డులతో సత్కరిస్తున్న కలెక్టర్ చేతన్, ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి, చిత్రంలో డీఈఓ మీనాక్షి, ఆర్డీఓ భాగ్యరేఖ

వైఎస్ జగన్‌తో నవీన్ నిశ్చల్ భేటీ



పుట్టపర్తి టౌన్: వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని తాడేపల్లిలోని ఆయన నివాసంలో ఆ పార్టీ హిందూపురం సీనియర్ నేత నవీన్‌నిశ్చల్ గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తాజా రాజకీయ పరిణామాలపై ఆయన చర్చించారు.

జపనీస్ భాషపై శిక్షణ, ఉద్యోగావకాశాలు

పుట్టపర్తి టౌన్: బీఎస్సీ, ఎమ్మెస్సీ, నర్సింగ్, ఏఎన్ఎం, జీఎన్ఎం కోర్సులు పూర్తి చేసిన విద్యార్థులకు ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్, ఎన్ఏవీఐఎస్ హెచ్‌ఆర్ సంయుక్త ఆధ్వర్యంలో జపనీస్ భాషపై ఎన్5 ఎన్4, ఎన్3 స్థాయిలలో శిక్షణ ఇచ్చి జపాన్ దేశంలో నర్సులుగా ఉద్యోగావకాశాలు కల్పించనున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి షేక్ అబ్దుల్ ఖయ్యూం తెలిపారు. ఈ మేరకు ఆయన గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. శిక్షణ పొందు అభ్యర్థులు జపాన్ దేశంలో పనిచేయడానికి సిద్ధంగా ఉండాలని సూచించారు. గ్రాడ్యుయేట్, బీఎస్సీ, ఎమ్మెస్సీ, ఏఎన్ఎం , జీఎన్ఎం చివరి సంవత్సరం చదువుతున్న వారు, 20 నుంచి 32 ఏళ్ల మధ్య వయసున్న వారు అర్హులని పేర్కొన్నారు. శిక్షణ కాల వ్యవధి ఆరు నెలలని, వసతి, ఇతర సదుపాయాలకు అయ్యే వ్యయంలో ప్రభుత్వం 50 శాతం మేర భరిస్తుందని తెలిపారు. ఇంటర్వ్యూలు, శిక్షణ బెంగళూరులో ఉంటుందన్నారు. శిక్షణ ఫీజు రూ.3,50,000 అయితే.. పాక్షిక శిక్షణ రుసుం రూ.50 వేలు చెల్లించాల్సి ఉంటుందని, ఇందులో ఏపీ స్కిల్‌డెవలప్‌మెంట్ సంస్థ రూ.25వేలు, మిగిలిన రూ.25వేలు అభ్యర్థి చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. మిగిలిన రూ.3లక్షలు మూడు విడతలుగా అభ్యర్థులు చెల్లించాల్సి ఉటుందని తెలియజేశారు. జీతం రూ.1.10లక్షల నుంచి రూ.1.40 లక్షల వరకు ఉంటుందని తెలిపారు. జపాన్ దేశంలో ఉద్యోగ అవకాశం కల్పించడానికి కావలసిన సదుపాయలు ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్, ఎన్ఏవీఐఎస్ హెచ్‌ఆర్ పర్యవేక్షిస్తాయన్నారు. www.apssdc.in.home.onlineprogram registration అని టైప్ చేసి వివరాలు నమోదు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు చైతన్యకుమార్ 93986 43930, టోల్ ఫ్రీ నంబర్ 99888 53335లో సంప్రదించాలని సూచించారు.

మట్టి గణపతిని పూజిద్దాం



మట్టి వినాయకులను పంపిణీ చేస్తున్న కలెక్టర్ టీఎస్ చేతన్



విగ్రహాలను పరిశీలిస్తున్న ఎస్పీ రత్న

ప్రశాంతి నిలయం: ప్రతి ఒక్కరూ మట్టి గణపతిని పూజించి పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని కలెక్టర్ టీఎస్ చేతన్ పిలుపునిచ్చారు. కలెక్టరేట్ ఆవరణలో ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో జిల్లా పర్యావరణ అనుకూల వినాయక చవితి అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా కలెక్టర్ హాజరై ప్రత్యేక కౌంటర్ ద్వారా మట్టి వినాయక విగ్రహాలను ఉచితంగా పంపిణీ చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ పర్యావరణాన్ని కాపాడుకునేందుకు మట్టితో తయారు చేసిన వినాయక విగ్రహాలను ఆరాధించాలన్నారు. కృత్రిమంగా లభించే ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్‌లో జిప్సం, గంధకం, మెగ్నీషియం వంటి హానికర రసాయనాలతో తయారు చేసిన విగ్రహాలను నిమజ్జనం చేయడం వల్ల జలవనరులు కలుషితమవుతాయన్నారు. జలవనరుల నాణ్యత తగ్గడంతో పాటు వృక్ష జంతు జీవనంపై ప్రభావం కలుగుతుందన్నారు. ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ కరిగిన నీటిని వినియోగించడం ద్వారా ఊపిరితిత్తులతో పాటు రక్తం, చర్మం, కంటికి సంబంధించిన వ్యాధులు వస్తాయన్నారు. విగ్రహాల తయారీకి సహజ సిద్ధమైన రంగులను, ప్రకృతితో తయారయ్యే పత్తి, నార వంటి పదార్థాలను వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా పర్యావరణ కాలుష్య నియంత్రణ మండలి అధికారులు పాల్గొన్నారు.

స్థలాలను పరిశీలించిన ఎస్పీ

కదిరి టౌన్: వినాయక చవితి సందర్భంగా పట్టణంలోని రైల్వే,గణేష్, శివాలయం, సింహకోట, ఎర్రకోట వద్ద భారీ విగ్రహాలు ఏర్పాటు చేసే స్థలాలను ఎస్పీ రత్న గురువారం పరిశీలించారు. విగ్రహాల ఏర్పాటుకు పోలీసుల అనుమతి తప్పనిసరిగా ఉండాలని సూచించారు. విగ్రహాలు నిమజ్జనం చేసే చెరువులు, కుంటలను పరిశీలించారు. నిమజ్జనం రోజు అవాంఛనీయ ఘటనలు జరగకుండా చూడాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఎస్పీ వెంట డీఎస్పీ శ్రీలత పాల్గొన్నారు.

మాతాశిశు మరణాలు అరికట్టండి

ప్రశాంతి నిలయం: జిల్లాలో మాతాశిశు మరణాలను అరికట్టాలని కలెక్టర్ చేతన్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని 'మీ కోసం' సమావేశ మందిరంలో గురువారం జిల్లాలో మాతా శిశు మరణాలపై జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ వైద్యశాఖలో అన్ని సదుపాయాలూ కల్పించినా మాతాశిశు మరణాలను అరికట్టడంలో విఫలమవుతున్నారని అసంతృప్తి వ్యక్తం చేశారు. గత ఏడాది అక్టోబర్ నుంచి ఈ ఏడాది జూన్ వరకు 5 మాతృమరణాలు, 32 శిశు మరణాలు సంభవించడం దారుణమన్నారు. మరణాలకు గల కారణాలపై లోతుగా విశ్లేషించి బాధ్యులకు నోటీసులు ఇవ్వాలని, సరైన వివరణ లేకపోతే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గర్భిణులు, బాలింతలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై క్షేత్రస్థాయి వైద్య సిబ్బంది చైతన్యం చేయాలని సూచించారు. ఏ తల్లీ జన్మనిస్తూ మరణించరాదని, ఏ బిడ్డా జనిస్తూ మరణించరాదని స్పష్టం చేశారు. కార్యక్రమంలో డీఎంహెచ్ఓ డాక్టర్ మంజువాణి, డీసీహెచ్ఎస్ డాక్టర్ తిప్పేంద్రనాయక్, ఐసీడీఎస్ పీడీ నాగలక్ష్మి, పలువురు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



సమీక్షలో పాల్గొన్న వైద్య, ఆరోగ్య శాఖ సిబ్బంది

పెట్రోల్ పోసి.. నిప్పు పెట్టి

- లడ్డు అంగడి దహనం
- రూ.6లక్షల నష్టం

ధర్మవరం అర్బన్: అడ్వాన్స్‌గా తీసుకున్న డబ్బు చెల్లించాలని అడిగినందుకు ఓ కార్మికుడు రెచ్చిపోయి తన యజమాని దుకాణానికి నిప్పు పెట్టాడు. పోలీసులు తెలిపిన మేరకు... ధర్మవరం నివాసి బాబ్జాన్... స్థానిక ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా లడ్డు అంగడి నిర్వహిస్తున్నాడు. రూ.15వేలు అడ్వాన్స్ చెల్లిస్తే అంగడిలో పనిచేసేందుకు వస్తానని షామీర్‌బాషా అనే వ్యక్తి ఒప్పందం కుదుర్చుకున్నాడు. దీంతో షామీర్‌బాషాకు రూ.15 వేలను బాబ్జాన్ చెల్లించాడు. అడ్వాన్స్ తీసుకున్న తర్వాత పనిలోకి పోకుండా తప్పించుకుని తిరుగుతుండడంతో విసుగు చెందిన బాబ్జాన్ నేరుగా షామీర్‌బాషా ఇంటికెళ్లి తాను చెల్లించిన అడ్వాన్స్ వెనక్కు ఇవ్వాలని డిమాండ్ చేశాడు. దీంతో కక్ష పెంచుకున్న షామీర్‌బాషా గురువారం వేకువజాము 2 గంటల సమయంలో లడ్డు అంగడి షట్టర్ కింద నుంచి పెట్రోల్ లోపలకు వెదజల్లి నిప్పు పెట్టి ఉడాయించాడు. ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో గమనించిన చుట్టుపక్కల వారు సమాచారం ఇవ్వడంతో బాబ్జాన్ అక్కడకు చేరుకుని స్థానికుల సాయంతో మంటలు అదుపు చేశాడు. అప్పటికే అంగడిలోని సరుకు, ఇతర విలువైన సామగ్రి కాలి బూడిదయ్యాయి. నిప్పు పెట్టిన షామీర్‌బాషాను స్థానికులు పట్టుకుని వన్‌టౌన్ పోలీసులకు అప్పగించారు. దాదాపు రూ.6 లక్షల మేర నష్టం వాటిల్లిందని, తనకు న్యాయం చేయాలని ఈ సందర్భంగా బాబ్జాన్ ఆవేదన వ్యక్తం చేశాడు. ఘటనపై బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.



కాలిపోయిన సరుకులు, వస్తువులు

పండ్ల దుకాణంలో అగ్ని ప్రమాదం

పుట్టపర్తి టౌన్: స్థానిక ప్రశాంతి గ్రాం వద్ద ఉన్న పండ్ల దుకాణంలో అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. 'వై' జంక్షన్ సమీపంలో రఫీక్ అనే వ్యక్తి పండ్ల దుకాణాన్ని ఏర్పాటు చేసుకుని జీవనం సాగిస్తున్నాడు. బుధవారం సాయంత్రం వ్యాపారాన్ని ముగించుకుని దుకాణానికి తాళం వేసి ఇంటికి చేరుకున్నాడు. గురువారం వేకువజామున దుకాణంలో నుంచి పొగలు వస్తుండడం చుట్టుపక్కల వారు గమనించి సమాచారం ఇవ్వడంతో యజమాని అక్కడకు చేరుకుని స్థానికుల సాయంతో మంటలు ఆర్పేందుకు ప్రయత్నించాడు. విషయం తెలుసుకున్న అగ్నిమాపక సిబ్బంది అక్కడకు చేరుకుని మంటలు అదుపు చేసింది. వినాయక చవితి పండగను పురస్కరించుకుని పెద్ద మొత్తంలో పండ్లను కొనుగోలు చేసి దుకాణంలో ఉంచానని, విద్యుత్‌షార్ట్ సర్క్యూట్ వల్ల మంటలు చెలరేగి దాదాపు రూ.2 లక్షల మేర నష్టం వాటిల్లినట్లు బాధితుడు వాపోయారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

ఇసుక ట్రాక్టర్లు, టిప్పర్ సీజ్

బత్తలపల్లి: మండలంలోని చిత్రావతి నది నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్లు, టిప్పర్‌తో పాటు ఇసుక తవ్వకాలకు వినియోగిస్తున్న జేసీబీలను పోలీసులు సీజ్ చేశారు. అందిన సమాచారం మేరకు గురువారం తెల్లవారుజాము 3 గంటలకు సిబ్బందితో కలసి ఎస్ఐ శ్రీనివాసులు చిత్రావతి నదీపరివాహక ప్రాంతంలో ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. మూడు జేసీబీలు, రెండు ట్రాక్టర్లు, ఓ టిప్పర్ పట్టుబడ్డాయి. వాటినీ సీజ్ చేసి స్టేషన్‌కు తరలించారు. వాహనదారులపై కేసులు నమోదు చేయనున్నట్లు పోలీసులు తెలిపారు. కాగా, ఇసుక అక్రమ రవాణాలో టీడీపీ నేతల హస్తం ఉన్నట్లు సమాచారం.



పోలీసుల స్వాధీనంలో ఉన్న జేసీబీలు, ట్రాక్టర్లు, టిప్పర్

10 నుంచి బ్యాడ్మింటన్ టోర్నీ

హిందూపురం టౌన్: ఈ నెల 10 నుంచి 13 వరకు హిందూపురంలోని దండు రోడ్డులో గల ఎస్‌పీఆర్ బ్యాడ్మింటన్ అకాడమీ ఇండోర్ స్టేడియం, మంజు బ్యాడ్మింటన్ అకాడమీలో రాష్ట్ర స్థాయి బ్యాడ్మింటన్ అండర్–15 సబ్ జూనియర్ బాల, బాలికల బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ పోటీలు నిర్వహించనున్నారు. ఈ మేరకు అనంతపురం జిల్లా బ్యాడ్మింటన్ సమాఖ్య అధ్యక్షుడు బుగ్గయ్య చౌదరి, ఉపాధ్యక్షుడు డి.ఆర్.వెంకటేష్, షఫీ, కార్యదర్శి జయకుమార్ గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలో వివిధ ప్రాంతాల నుంచి క్రీడాకారులు హాజరవుతారని, ప్రముఖుల చేతల మీదుగా టోర్నీ ప్రారంభమవుతుందని పేర్కొన్నారు.